# తమసోమా...

పది గంటలు కొడుతూ ఉండగా, ప్రాజెక్టు ఆఫీసు పోర్టికోలోకి కారు వచ్చి ఆగింది. కారుదిగి గోపాలరావు, తన గదిలోకి వెళ్లిపోయాడు. కిటికీలోంచి చూస్తే, నిర్మాణంలోవున్న ప్రాజెక్టు దూరంగా కనిపిస్తోంది. బ్రహ్మాండమైన శబ్దంతో ఒక బుల్‌డోజర్ వెడుతోంది. కిటికీ వేసి వచ్చి కుర్చీలో కూర్చుంటూవుండగా టెలిఫోను మ్రోగింది. ఆవల కంఠం...

"సెంట్రల్ ఆఫీసుకు ఒకసారి రండి" అని పలికింది.

సెంట్రల్ ఆఫీసుకు వెళ్ళేసరికి, ఆరుగురు వ్యక్తులు యితనికోసం కనిపెట్టుకుని వున్నారు. ఇతన్ని చూడగానే చౌదరిగారు చిరునవ్వుతో 'హలో!' అని పలుకరించి "రండి! మీకోసమే కనిపెట్టుకొని వున్నాం" అని అన్నాడు.

"ఎందుకో రమ్మన్నారట? ఇప్పుడే ఫీల్డునుంచి రిపోర్టు వచ్చింది."

"వచ్చిందా? ఏమని?"

"మీరు చెప్పిన ప్రకారం పని చేశారుట. పూర్వం వారంరోజులు పట్టేపని ఇప్పుడు ఒక రోజులో ముగించగలుగుతాం. దానివల్ల ప్రాజెక్టు పూర్తి అయ్యేసరికి దాదాపు డెబ్బై, ఎనభై లక్షలు రూపాయలు మిగలవచ్చు."

"ఐ యామ్ గ్లాడ్."

"ఈ పని కోసం రెండు మాసాలు నిద్రాహారాలు మాని, రేయింబవలూ పడ్డ శ్రమ మీ అందరికీ తెలిసిందే. ఎప్పటికప్పుడు మీపనిని గురించి రిపోర్టు పంపుతునే వున్నారు. మీ శ్రమను, సేవను గవర్నమెంటు తప్పక గుర్తిస్తుంది. మీకు ప్రమోషన్ యివ్వవలసిందిగా రికమెండు చేస్తున్నాను."

"థాంక్స్."

"మీవంటివారి నిస్వార్థసేవ, సహకారం వుంటే మనం, మనదేశం అన్ని విధాలా అభివృద్ధి చెందుతాయి. నేను..."

టెలిఫోన్ మ్రోగింది.

ఆవల కంఠం "గోపాలరావుగారు కావాలి" అని అడిగింది. టెలిఫోను-హాస్పిటల్ నుండి.

"మేము హాస్పిటలు నుండి మాట్లాడుతున్నాం. మీ భార్య మిమ్మల్ని పిలుస్తున్నారు."

"ఏం జరిగింది? ఎల్లా వుంది?"

"ఏం ఫర్వాలేదు. ఇప్పుడే నిద్రలేచారు. వీలుంటే ఒకసారి రండి."

"ఇప్పుడే వస్తున్నా."

కారు శరవేగంతో బయలుదేరి మలుపు తిరిగి కొండ నెక్కడం మొదలు పెట్టింది. రోడ్డు ప్రక్కన చెట్టునీడలో ఎవరో ఆడమనిషి పసిపిల్లకు పాలు యిస్తోంది. ఆ దృశ్యం చూడగానే కారు వేగం ఒక్కక్షణం మందగించింది. ఒక వేడినిట్టూర్పు కారులోంచి వెలువడింది. మనస్సులో ఒక ఆలోచన మెరిసింది.

"భగవంతుడు ఎంత నిర్దయుడు?"

"అపాయం, దారిలేదు" అనే బోర్డుదాటి కారు ముందుకుసాగి, సడన్ బ్రేకు వేసుకొని, అక్కడే ఆగిపోయింది.

వెనక్కి తిరిగి కారు మళ్లీ కొండనెక్కడం మొదలు పెట్టింది. కొద్దిదూరంలో పల్లం, అందులో ఒక చిట్టడవి, అడవిమధ్య హాస్పిటలు. ప్రాజెక్టు రాక పూర్వం యిది బ్రహ్మాండమైన అడవి. అడుగు అటువెయ్యడానికి ఎవరైనా సాహసిస్తే కబళించడానికి సిద్ధంగా ఎన్నో ఎన్నో జీవాలుండేవి. ఈనాడు ఆ ప్రదేశం మృత్యుముఖంలో వున్న వ్యక్తులకు చేయూత నిచ్చి మళ్ళీ యీ మానవలోకంలోకి తీసుకురావడానికి సహాయ పడుతుంది.

కాలం ఎటువంటి మార్పులని తీసుకువస్తోంది!!!

హాస్పిటల్లో ఒక తియ్యటి కంఠం "యస్ ప్లీజ్" అని పలుకరించింది.

"స్పెషలు వార్డులో నా భార్య వుంది. చూడాలి."

"వెళ్లండి, డ్యూటీనర్సు కూడా అక్కడే వుంది." నర్సు యితన్ని చూడగానే,

"రోగికి హైరాను కలిగించే విషయాలు ఏమీ చెప్పవద్దు."

"ఏం జరిగింది?"

"చాలా నీరసంగా వున్నారు. బహుశః లేవడానికి ప్రయత్నం చేసి వుండవచ్చు. అప్పుడు కుట్లు తెగివుంటాయి."

"దానివల్ల మీకు హైరాను, ఆందోళన కలిగించడం కంటె ప్రయోజనం ఏమీ వుండదు. డాక్టర్ గిరిధర్ గారికి తెలియపరిచాం."

"ఆయన వచ్చారా?"

"వచ్చారు. చేయవలసిందంతా చేశారు."

"ఇప్పుడు ఎల్లా వుంది?"

"ప్రమాద పరిస్థితి తప్పింది... ఒకటి రెండు నిముషాల కంటె ఎక్కువసేపు మాట్లాడవద్దు."

గదిలో అంతా నిశ్శబ్దం. రోగిదగ్గరకు వెళ్ళి కూర్చొని మెల్లగా 'కమలా' అని పిలిచాడు.

కన్ను తెరచి యితనివంక చూసింది. కన్నుల నిండా నీరు.

"వచ్చారా!... ఈ పాపిష్టిదాన్ని క్షమించారా!"

"ఛా! అవేం మాటలు? నువ్వేం తప్పుచేశావని క్షమించడానికి."

"నేనేం చెయ్యలేదా?"

"నా కమల ఎప్పుడూ తప్పుపని చెయ్యదు..."

"చేస్తే?"

"....నేనే కాదు నా కమలను దేముడు కూడా దండించడు. చూడు కమలా! నేను ఇప్పుడే సెంట్రల్ ఆఫీసు నుంచి వస్తున్నా. నేను యిచ్చిన సలహా ప్రకారం పని చేశారట, చాలా జయప్రదంగా జరిగింది. నాకు ప్రమోషన్ వస్తుంది. నీకు ఆరోగ్యం చిక్కగానే రెండు నెలలు సెలవుపెట్టి కాశ్మీరు వెడదాం."

అతని చేతిని తన చేతుల్లోకి తీసుకుని,

"మీరు ఎంత మంచివారు" అని అంది.

"నీకంటేనా?"

"మిష్టర్ రావు" అని నర్సు కంఠం వినిపించింది.

"వెడుతున్నాను! మళ్ళీ సాయంకాలం వస్తాను" అంటూ బయలుదేరాడు.

కారు ఎక్కబోతూ వుంటే మొదట్లో కనబడ్డ నర్సు వచ్చింది:

"ఇందాక ఇవ్వడం మరిచిపోయాను. మీకు యిమ్మని యీ ఉత్తరం మీ ఆవిడ యిచ్చారు."

"ఎప్పుడు?"

"నిన్న."

"థాంక్సు" అని, కారులోకి వచ్చి ఉత్తరం చదవటం మొదలు పెట్టాడు.

"బాబు మనకు ఎందుకు దక్కలేదో ఇప్పుడే నాకు అర్థమయింది. మీ యెడల ఎంతో ద్రోహం చేశాను. అందుకనే నాకు భగవంతుడు యీ శిక్ష విధించాడు. మీరు ఏ విషయం నాతో దాచలేదు. అందుకనే మీరు తల పెట్టిన పనులు

నెరవేరినాయి. నేను ఎంతో పాపాన్ని మనస్సులో దాచాను. మీకు తెలియని రహస్యం. నాలో నివురుకప్పిన నిప్పు అయింది. అందుకని భగవంతుడు నాకు ఈ శిక్షవిధించాడు. నేను తక్కువ నోములు నోచినదాన్ని. నా సర్వస్వం యిది వరకే యింకొకరికి అర్పించి వేశాను. కాని మా ప్రేమలు ఫలించలేదు. దైవం నన్ను చిన్న చూపు చూశాడు. మీతో ఈ విషయం చెప్పి వేద్దామని ఎన్నోసార్లు ప్రయత్నం చేశాను. కాని మీ ప్రసన్నవదనం చూడగానే, ఏంచెప్పాలో, ఎల్లాచెప్పాలో తెలియక, చెబుతే మీ రెంత బాధపడతారోనని చెప్పలేక పోయాను. ఈమాటు చెప్పకుండా వుండలేను. నాకు పిలుపు వినిపిస్తోంది. నేను పోయిన తరువాత ఎవరి వల్లనైనా యీ విషయం వింటే, ఎంతో బాధపడతారు. నన్ను మోసగత్తెగా తలచి, అసహ్యించుకుంటాను. నేను వున్నా లేకపోయినా, మీ మనస్సులో మాత్రం నామీద దయ, ప్రేమవుండాలి. అందుకని నేనే చెప్పివేస్తున్నా.

నన్ను క్షమించమని నేను ప్రార్థించడంలేదు. అందుకు నేను అర్హురాలిన కాదు. వాడల్లా ఒక్కటే ప్రార్థన! మీ యిష్టం వచ్చిన శిక్ష విధించండి.

కమల.'

ఒక్క వుదుకున కారులోంచి దిగి సరాసరి కమల వున్న గది దగ్గరకు వెళ్లాడు. గది తలుపు వేసివుంది. కుర్చీలో కూర్చొని నన్సు ఏదో రాసుకుంటోంది. యితన్ని చూడగానే "మళ్ళీ వచ్చారేం!" అన్నట్టు చూసింది.

"నేను కమలతో మాట్లాడాలి."

"ఆవిడ చాలా అలసివున్నారు. పైగా నిద్దురపోతున్నారు."

"ఒక్క నిముషం..."

"సారీ, నిద్దురపోతున్న వాళ్లని డిస్టర్బ్ చెయ్యడానికి మాకు పవర్స్‌లేవు.'

తిరిగివచ్చి కారులో కూర్చున్నాడు. ఉత్తరం ఒకటికి పదిసార్లు చదువు కున్నాడు. చింపి పారేద్దామని అనుకున్నాడు. కాని, ఆ పనిచేయడానికి చేతులు ఒప్పుకోలేదు. అల్లా శూన్యంలోకి చూస్తూ ఎంతసేపు కూర్చున్నాడో తెలియదు. ఏదో ఒక ఆలోచన మనస్సులో మెసలింది.

వెర్రివేగంతో కారు బయలుదేరింది. కొండలు, గుట్టలు, వాగులు, మైదానాలు ఇవి ఏవీ కార్ని ఆపలేకపోయాయి. అనేక మైళ్ళు ప్రయాణం చేసాడు. ఒక పెద్ద భవంతి దగ్గర ఆగింది. సావిట్లో సోపాలో యితని వయస్సుగల వ్యక్తే ఒకతను ఏదో చదువుకుంటున్నాడు. అతన్ని చూడగానే...

"కృష్ణ మీరేనా?" అని అడిగాడు.

"ఎవరు?" అని అడిగాడు.

"నేను గోపాలరావుని."

.........................

"కమల నా భార్య."

"ఓహో! మీరా! క్షమించండి. గుర్తుపట్టలేకపోయాను... కమలేది?"

"నేనే వచ్చాను."

"కూర్చోండి. ఒక్క నిముషంలో వస్తా" అంటూ అతను లోపలకు వెళ్ళాడు. మరుక్షణం, కమల యీడు పిల్లతో తిరిగి వచ్చాడు. రెండుకప్పులు కాఫీ బల్లమీద పెట్టి రవ్వంత దూరంగా నిలబడ్డది.

"వీరు గోపాలరావుగారు, మన కమల భర్త... నా భార్య సరోజ" అని ఉభయులకు పరిచయం చేశాడు.

"చాలా దూరం ప్రయాణంచేసి వచ్చారు. బాగా అలసిపోయారు. ముందు కాఫీ త్రాగండి! తరువాత అన్ని విషయాలు తీరిగ్గా మాట్లాడుకుందాం."

"అక్క గారిని కూడా తీసుకురావలసింది" అని సరోజ అంది.

"నేను మీతో ఒంటరిగా మాట్లాడాలి." సరోజ లోపలకు వెళ్ళిపోయింది.

"చెప్పండి."

"ఈ ఉత్తరం చదవండి."

కృష్ణ ఆ ఉత్తరం పూరిగా చదివి తిరిగి యితనికి యిచ్చివేశాడు. ఏం మాట్లాడలేదు.

"నిజమేనా?"

"నిజమే."

"పరాయిపిల్ల బ్రతుకు నాశనం చెయ్యడం..."

"అప్పుడు కమల పరాయిది కాదు."

"ఏమన్నారు?"

"ఉన్నమాటే అంటున్నాను. కమల ఆనాడు పరాయిది కాదు."

"ఎందుకని?"

"కమల పుట్టినప్పటి నుంచి నాభార్య అవుతుందని అంతా అనేవాళ్లు. మా మనస్సులో అదేమాట నిలచిపోయింది. కాని పెద్దవాళ్ళ మనస్సులో యీ మాట నిలువ లేదు.

కమలా వాళ్ళది పెరిగేసంపద. మాదో తరగలేదు, పెరగలేదు. మాకంటె వెనుకవున్నవాళ్ళు మాకంటె ముందుకు సాగిపోయేసరికి మేము వాళ్ళకంటికి చిన్న వాళ్ళమయ్యాము. మా తరహాలు, అంతస్తులు తగనివి, తూగనివి అయ్యాయి. అప్పటికీ మా వలపులు మాయలేదు, ప్రేమలు మరచిపోలేదు.

కమలకు బయటసంబంధాలు చూస్తున్నారని తెలిసిననాడు మేమంతా ఎంత బాధపడ్డామో ఏం చెప్పను? ఎన్నడూ ఎవరినీ ఏమీ అడగని వ్యక్తి మా అమ్మ నా కోసం లక్షాధికారుల సంబంధాలు వస్తున్నా, కాదని, తాను స్వయంగా వెళ్ళి అడిగితే కమల తల్లిదండ్రులు కాదనలేరనే ధైర్యంతో ఆశతో తనకు తానై వెళ్లి అడుగకుండానే తిరిగి వచ్చింది.

కమలకు అప్పుడే మీతో వివాహం నిశ్చయమై, లగ్నమై స్థిరపరిచారు. మీరు విదేశాలలో విద్యనభ్యంసి పెద్ద ఉద్యోగంతో హోదాతో యీదేశానికి తిరిగివచ్చారు. మీ ముందు నాయోగ్యతలెక్కడ?

కమల ఎంతో గోలపెట్టింది. ఆ చిన్నదాని గోడు అరణ్యరోదనమైంది. ఈనాడు యిద్దరం చెరొక చోట చావలేక బ్రతుకుతున్నాం. పరాయివారెవరో యిప్పుడు చెప్పండి."

కొద్దిక్షణాలు ఎవ్వరూ మాట్లాడలేదు. రావు మెల్లగా "అగ్గి పెట్టె యివ్వండి' ' అని అడిగాడు. మరుక్షణంలో రెండు సిగరెట్లు వెలిగాయి.

"కాఫీ త్రాగండి."

"తాగలేను."

"ప్లీజ్!"

"నేను వెళ్ళిపోతున్నాను."

"అప్పుడేనా... కొంచెం సేపు విశ్రాంతి తీసుకోండి."

"నా కిక విశ్రాంతిలేదు."

"మీ మనస్సుకు చాలా బాధ కలిగించాను. మీతో నిజం చెప్పలేకుండా వుండలేక పోయాను."

"ఇది దాచినా దాగని సత్యం. ఏనాడో బయటపడేది."

"నేను ఒకటి ప్రార్థిస్తున్నాను."

"కమలని ఏమీ అనకండి."

"కమల నా భార్య."

"కాదని నేనటంలేదు. ఆ వ్యక్తి యిప్పటికే ఎనలేని దారుణవ్యధలకు లోనైంది. కడుపార కన్న పసిబిడ్డ కన్ను తెరవకనే పోయింది. మనసిచ్చిన వ్యక్తి తనకు కాకుండా పరాయివాడయ్యాడు. ఎంతో కాలం మనస్సులో దాగిన యీ దావాగ్ని యీనాడు బహిర్గతమయింది. మీరు వివేకవంతులు, విజ్ఞానవంతులు. ఆ పిల్ల మనస్సులోని ఆవేదనను అర్థం చేసుకుని ఆదరించకపోతే మనకు మనిషే దక్కదేమో!"

"మీకు మీ విషయం, మీ కమల విషయమే; నన్ను గురించిన ఆలోచన లేదు. ఎంతో అనురాగవతియైన భార్య దొరికిందని సంబరపడ్డాను. ఈనాడు నా కలలన్నీ నాశనమైయ్యాయి. నేను అర్జించే కీర్తిలో కమల పాలుపంచుకోవాలని రాత్రనక పగలనక కష్టించాను. ఎందుకీశ్రమ! నేను అగ్నిసాక్షిగా వివాహమాడిన వ్యక్తి వివాహానికి పూర్వమే, తన సర్వస్వం యింకొకరికి అర్పణ చేసిందని, నాపై చూపిన ప్రేమ అంతా నటన, కపటం అనీ తెలియడానికేనా? ఈ అవమానం పొందడానికేనా నేను యింతకాలం ప్రాణం కంటె ఎక్కువగా మానం, శీలం, కాపాడుకున్నది? నా మనస్సులో చెలరేగే బాధ ఎల్లా చెప్పినా అర్థం చేసుకోగల వ్యక్తి యీనాడు మనస్సునుంచి మాయమైపోయింది. ఇహ ఆ వ్యక్తిని అనురాగంతో ఎల్లా చూడను. ఈనాడు మా యిద్దరి మధ్య అంతులేని అగాధం ఏర్పడింది. ఇది ఎన్నటికినీ దాటలేము. కమల యీ రహస్యాన్ని తనలోనే యిముడ్చుకో గలిగితే ఎంతో ధన్యుడిని అయ్యేవాడిని, కమలను నేను క్షమించగలిగే వాడిని."

"అల్లా ఎందు కనుకోవాలి? కమలను మీరు యిప్పటికీ క్షమించగలరు. ప్రేమను గుర్తించగల ఉదార హృదయం మీది. అందుకనే యింతదూరం వచ్చారు. కమలను క్షమించగలరు. గతాన్ని విస్మరించగలరు."

"దయచేసి ఇహనేం చెప్పవద్దు."

"క్షమించండి. నేనేం మాట్లాడను."

"నేను వెడుతున్నాను. కాని ఒక్కమాట మీరు కమలను..."

"కలియటానికి ఎన్నడూ ప్రయత్నించను."

"థాంక్సు."

వచ్చిన త్రోవనే కారు యింటికి మళ్లింది. సరాసరి యింటికి చేరలేదు. 'అపాయం-ఇది దారికాదు' అనే బోర్డు దగ్గరకు వచ్చి ఆగింది. బోర్డుకు రవ్వంత దూరంలో అంతులేని అగాధం, కొన్నివేల అడుగుల లోతు లోయ, కొండ అంచుల వెంబడి బ్రహ్మాండమైన వృక్షాలు, లోయలో శరవేగంతో ప్రవహించే నది.

కారు దిగి బోర్డు దగ్గరకు వచ్చి నిలబడ్డాను.

"ముందుకు అడుగువేస్తే...."

నేను మరణిస్తే ఎవరికి నష్టం? ఇదే ప్రశ్న మనస్సున ఒకటికి పదిసార్లు పరుగుల తీసింది.

"ఎవరికీ నష్టంలేదు... ఎవరికీ నష్టంలేదు!..."

"అయితే యిక ఆలస్యం దేనికి!"

వడివడిగా అడుగు ముందుకు సాగింది.

ముందుకు సాగిన పాదాన్ని ఎవరో పట్టుకున్నారు. ఎవరూ! అని వెనక్కి తిరిగి చూసేసరికి ఎవ్వరూ లేరు. దట్టంగా పెరిగిన తీగె కాలుకు చుట్టుకుని వుంది. తీగెను కాలి నుండి వదిలించి తల ఎత్తి చూసేసరికి దూరంగా ప్రాజెక్టు ఆఫీసు కనిపిస్తోంది. పైన త్రివర్ణ పతాకం గర్వంతో రెపరెప లాడుతోంది.

"ఇటువంటి మహత్తర కార్యాలు నెరవేరాలంటే, మనం, మన దేశం అభివృద్ధి చెందాలంటే మీ వంటివారి నిస్వార్థసేవ కావాలి" అని చౌదరి అన్నమాటలు స్ఫురణకు వచ్చాయి.

"నిస్వార్థ సేవజేస్తే, చివరకు మిగిలేదేమిటి? ఏమీ మిగలదు కాబట్టే నిస్వార్థసేవ అని అన్నాడు చౌదరి. "నా జీవితం, నా సర్వస్వం నాశనమైపోతుంటే నేను ఎందుకు సేవ చేయాలి. ఈ దేశం నాకోసం ఏం చేస్తోంది! నాకు యీపని అక్కర్లేదు... అక్కర్లేదు."

చూపు అటునుండి మళ్లీ యింకొక దిక్కుకు తిరిగింది. ఒక్కసారి మనస్సు వెర్రిపరుగులు తీసింది. దూరంగా బ్రహ్మాండమైన వృక్షాలు మధ్య, ఎండలు మిలమిల మెరసి పోతున్న ప్రాజెక్టు హాస్పిటలు.

హాస్పిటలు!!!

కమల హాస్పిటల్లో వుంది.... తనను ఈ నాలుగు సంవత్సరాలూ, స్వర్గాని కెత్తిన వ్యక్తి యీనాడు ఒంటరిగా, నిస్సహాయిగా చావుబ్రతుకుల మధ్య వుంది.

"కమల దగ్గరకు వెళ్ళాలి."

"వెళ్ళను. నన్ను మోసగించిన ఆ వ్యక్తి దగ్గరకు వెళ్ళను."

"నిన్ను మోసగించ తలచితే యీ రహస్యాన్ని తనలోనే యిముడ్చుకునేది.

"నా కమల ఎన్నడూ ఆ పని చెయ్యదు."

"చేస్తే?"

"నేనే కాదు దేముడు కూడా దండించడు."

"నేనే యిల్లా చేస్తే?"

"కమల తప్పక క్షమించేది."

"కమలను చూడాలి."

వల్లమాలిన వేగంతో పరుగులుదీసి, కారు హాస్పటలు చేరింది. నర్సు యీతన్ని చూడగానే, "వచ్చారా? డాక్టరుగారు మిమ్మల్ని పంపమన్నారు."

"కమల ఎల్లా వుంది?"

"కమల?... కులాసాగానే వున్నారు. మొదట డాక్టరుగారిని కలుసుకోండి.'

డాక్టరు యితన్ని చూడగానే,

"రండి కూర్చోండి. రెండు రోజులుగా మీకోసం ఎదురుచూస్తున్నాం."

"ఏం జరిగింది?"

"డాక్టర్లుగా మేము చేయగలిగినదంతా చేశాము."

"ఏం జరిగింది? కమల ఏది?"

"అయాం సారీ మిష్టర్ రావు... మీరు వెళ్ళిన రెండుగంటలకు...."

"రెండు గంటలకు...."

"ఆవిడ మరణించారు."

కమల మరణించింది!!!

"కమలా" అంటూ వెర్రికేక పెట్టాడు. తరువాత ఏం జరిగిందో తెలియదు.

డాక్టరు బెల్‌కొట్టి "సిస్టర్" అని పిలిచాడు.

అదే సమయంలో ప్రమోషను టెలిగ్రాము చేత బుచ్చుకొని చౌదరి, రావు గదికి బయలుదేరాడు.